నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: మైత్రీవనం సబ్‌స్టేషన్ అమీర్‌పేట, ఆదిత్య ఎన్‌క్లేవ్ ఫీడర్ల పరిధిలో దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించే క్రమంలో మంగళవారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ వంశీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 వరకు ఆర్‌ఎస్‌బ్రదర్స్, కాకతీయ మెస్, అమీర్‌పేట మెయిన్‌రోడ్డు, దుర్గానగర్, ఆదిత్యబ్లాక్, ఆదిత్య వింధ్య బ్లాక్, కుమ్మరి బస్తీ, ఇమ్రోజ్ హోటల్ లేన్, ఆనంద్ బజార్ లేన్, జీన్స్ కార్నర్, కాకతీయ మెస్, డెల్టా ఛాంబర్స్, అమీర్‌పేట మెయిన్‌రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు.

గేటు మూసివేతతో రాకపోకలకు ఇక్కట్లు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్ కాలేజీ గేటు మూసివేతతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతుందని విద్యార్థులు పేర్కొన్నారు. ఆర్ట్స్ కాలేజీతో పాటు యూనివర్సిటీ లైబ్రరీ, గెస్ట్‌హౌస్, మూడు దేవాలయాలకు ప్రధాన రోడ్డు నుంచి లోనికివెళ్లేందుకు రెండు గేట్లు ఉన్నాయి. ఇందులో ఒక గేటును మూసివేయడంతో ఒకే గేటు నుంచి విద్యార్థులు, కార్లు, ద్విచక్ర వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఆర్ట్స్ ఆర్ట్స్ కాలేజీ ప్రొ.కాశీం మూయించిన గేటును ఓయూ వీసీ ప్రొ.కుమార్ జోక్యం చేసుకొని గేటును తెరిపించాలని విద్యార్థులు కోరారు.

ప్రజా ప్రతినిధుల వేతనాన్ని వరద బాధితులకు అందజేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన కామారెడ్డి, మెదక్ జిల్లాల ప్రజలకు ప్రజా ప్రతినిధులు ఒక నెల వేతనాన్ని విరాళంగా అందచేయాలని ఓయూ జేఏసీ అధికార ప్రతినిధి బోనాల నగేష్ విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట మాట్లాడుతూ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకొని కష్టాల్లో ఉన్న ప్రజలను ఆదుకోవాలని ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులను కోరారు. వరద బాధితులకు కేంద్ర సహాయం కోసం తెలంగాణ ఎంపీలు కేంద్రం పై ఒత్తిడిచేయాలని డిమాండ్ చేశారు.

ఓయూలో బీసీ విద్యార్థి నాయకుల అరెస్ట్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో బీసీ విద్యార్థి నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం బీజేపీ కార్యాలయం ముట్టడికి ఓయూ నుంచి బయలుదేరగా అడ్డుకొని అరెస్ట్ చేశారు. విద్యార్థుల అరెస్టును బీసీ ఇంటలెక్చువల్ ఫోరం ఛైర్మన్ మాజీ ఐఏఎస్ అధికారి ఖండించారు. బీసీ వాటా కోసం పోరాడుతున్న విద్యార్థి నాయకులను అరెస్ట్ చేయడం దారుణమన్నారు. కేసులు పెట్టకుండ బెషరతుగా విడుదల చేయాలనీ చిరంజీవులు పోలీసులను కోరారు.

నవజాత శిశువుకు అరుదైన వైద్యం

రాంగోపాల్‌పేట్: నెలలు నిండకుండానే 1.1 కిలోల బరువుతో పుట్టిన బాలుడికి సికింద్రాబాద్ కిమ్స్ కడల్స్ వైద్యులు అరుదైన చికిత్స చేశారు.సోమవారం ఆస్పత్రిలో ఆస్పత్రి డైరెక్టర్ చీఫ్ నియోనటాలజిస్ట్ డాక్టర్ బాబు ఎస్ మదార్కర్ వివరాలు వెల్లడించారు. గుజరాత్ సూరత్ నుంచి బాలుడికి ఆరోగ్య సమస్యలు ఎక్కువ కావడంతో సికింద్రాబాద్ కిమ్స్ కడల్స్‌కు తీసుకువచ్చారు. దాదాపు 513 కిమీ దూరం నుంచి బాలుడిని అంబులెన్స్‌లో తీసుకువచ్చి చికిత్స చేశామన్నారు. అనారోగ్యంగా ఉన్న ఆ చిన్నారికి 65 రోజుల పాటు చికిత్స అందించామన్నారు. కిమ్స్ సీఎండీ డాక్టర్ భాస్కర్‌రావు పాల్గొన్నారు.

అంతర్ పాఠశాలల క్రీడా పోటీలు ప్రారంభం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ మోడల్ హై స్కూల్‌లో మూడు రోజుల అంతర్ పాఠశాలల క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. సోమవారం డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ శ్రవణ్ పాఠశాల విద్యార్థుల కబాడీ, ఖోఖో పోటీలను ప్రారంభించి మాట్లాడారు. అంతరం క్రీడల నిర్వహకుడు ఓయూ మోడల్ స్కూల్ సీనియర్ ఉపాధ్యాయుడు దాసరి సుధాకర్‌ను ఘనంగా సన్మానించారు.

అలరించిన నృత్య ప్రదర్శన



రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ గణపతి దేవాలయంలో నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక, సాంస్కృతి, దార్మిక కార్యక్రమాలు అలరిస్తున్నాయి. సోమవారం సాయంత్రం బడుగు నిఖిత ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన అందరిని అలరించింది.

కీలక ఘట్టానికి నిరంతర నిఘా

నిమజ్జనోత్సవానికి ప్రత్యేక బలగాలు
- అసాంఘిక శక్తుల కదలికలపై దృష్టి
- గణపతి విగ్రహాలకు జియో ట్యాగింగ్ పూర్తి
- 500 మంది సిబ్బందితో శాంతిభద్రతల పర్యవేక్షణ
- 'సాక్షి' ఇంటర్వ్యూలో బేగంపేట ఏసీపీ గోపాలకృష్ణమూర్తి





సనత్‌నగర్: వినాయక నవరాత్రి వేడుకల్లో నిమజ్జనోత్సవం కీలకమైన ఘట్టం. ఏ అసాంఘిక శక్తి ఎటు వైపు దూసుకువస్తోందనని అటు నిర్వాహకులు, ఇటు పోలీసులకు కఠిన పరీక్ష. మద్యం మత్తులో ఎక్కడ గొడవలు జరుగుతాయోనని ఒకింత ఆందోళన. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నగర పోలీసు కమిషరేట్ పరిధిలో బేగంపేట డివిజన్‌లో పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు బేగంపేట ఏసీపీ గోపాలకృష్ణమూర్తి స్పష్టం చేశారు. స్థానిక పోలీసు సిబ్బందితో పాటు బయటి నుంచి ప్రత్యేక పోలీసు బలగాలను రప్పించి అడుగడుగునా నిఘా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. చివరి రోజు నిమజ్జనం రోజైన ఈ నెల 6 నాటికి 500 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తామన్నారు. నిమజ్జన ఏర్పాట్లపై ఈ సందర్భంగా ఆయన 'సాక్షి'తో ఇంటర్వ్యూ.

- బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో 434, బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో 290 మొత్తం 724 విగ్రహాలు పోలీసుల అనుమతితో ఏర్పాటు చేశారు. వీటిలో బేగంపేటలో 80, బోయిన్‌పల్లిలో 88 మొత్తం 168 విగ్రహాలు ఇప్పటివరకు నిమజ్జనం అయ్యాయి. ఆదివారం ఐదో రోజు ఎక్కువ విగ్రహాలు నిమజ్జనం జరిగాయి. తొమ్మిదో రోజు ఈ నెల 4న ఎక్కువ విగ్రహాలు నిమజ్జనానికి తరలనున్నాయి. చివరి రోజు నిమజ్జనం నాటికి 180 విగ్రహాలు మిగులుతాయి.
- డివిజన్ పరిధిలో ఎక్కువ శాతం హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం చేస్తారు. దీంతో పాటు కొన్ని విగ్రహాలు హస్మత్‌పేట చెరువు, శామీర్‌పేట లేక్, ఐడీఎల్ చెరువుల్లో నిమజ్జనం చేయనున్నారు. నిమజ్జనం రోజున ప్రతి విగ్రహానికి ఒక పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహిస్తారు.
- మూడు నాలుగు విగ్రహాలకు క్లస్టర్ టీమ్‌తో పాటు పెట్రోలింగ్ సిబ్బంది నిరంతర పర్యవేక్షణ జరుపుతారు. ఇక బేగంపేటలో 5 సెక్టార్లు, బోయిన్‌పల్లిలో 4 సెక్టార్లకు సంబంధించిన ఎస్ఐలు నిమజ్జన ఊరేగింపుపై నిరంతర పరిశీలన జరుపుతారు. వీరితో పాటు త్వరత్వరగా శోభాయాత్ర ముందుకుకదిలేలా పుషింగ్ టీమ్‌లు, అనుమానితులను చెక్ చేసేందుకు ప్రత్యేక టీమ్‌లను నియమించడం జరిగింది. సాధ్యమైనంత త్వరగా శోభాయాత్రలు ప్రారంభించి త్వరగా పూర్తి చేయాలని నిర్వాహకులకు ఇప్పటికే మార్గదర్శకాలు ఇచ్చాం. అందుకనుగుణంగా నిర్వాహకులు ఏర్పాట్లు చేసుకోవాలి.
- నిమజ్జనానికి తరలే రూట్లను ఇప్పటికే గుర్తించాం . ఈ క్రమంలో విద్యుత్ తీగలు, కేబుల్ వైర్లు, రోడ్లపై గుంతలు వంటి వాటిపై సంబంధిత విభాగాల అధికారులతో ఇప్పటికే సమన్వయం చేసుకుని ఆ దిశగా చర్యలు చేపట్టాం.
- గతంలో కరీంనగర్ నుంచి వచ్చిన కానిస్టేబుల్‌పై దాడి, అక్కడక్కడ కొన్ని సంఘటనలు జరిగాయి. వీటి దృష్ట్యా ఇప్పటికే రౌడీషీటర్లను బైండోవర్ చేశాం.
- సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి అక్కడ అదనపు బలగాలను పెట్టడం జరిగింది. బేగంపేట పాటిగడ్డ, ఎస్‌బీటీనగర్, రసూల్‌పురా, అన్నానగర్, ఓల్డ్‌కస్టమ్స్‌బస్తీ, బోయిన్‌పల్లి హస్మత్‌పేట, దిల్‌కుష్‌నగర్, బాపూజీనగర్, సెవన్ టెంపుల్స్ ఏరియా, తాడ్‌బంద్ తదితర ప్రాంతాలను సున్నిత ప్రాంతాలుగా గుర్తించి తదనుగుణంగా బందోబస్తు ఏర్పాట్లు చేశాం. ఆయా ఏరియాల్లో 20 వరకు పికెట్స్‌ను ఏర్పాటుచేశాం.
- మొత్తం 724 విగ్రహాలకు జియో ట్యాగింగ్ పూర్తి చేశాం. దీని వల్ల ఏ మండపం వద్ద ఎలాంటి అలజడి జరిగినా పోలీసులు క్షణాల్లో అక్కడికి చేరుకునేందుకు అవకాశం ఉంటుంది. అలాగే ప్రతి మండపం వద్ద ఏమి చేయవచ్చో, ఏమి చేయకూడదనే అంశాలతో కూడిన బుక్‌లెట్‌ను కూడా అందజేశాం.
- ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా అన్ని భద్రతా చర్యల్లో భాగంగా బెల్టుషాపులతో పాటు వైన్‌షాపుల నుంచి పెద్ద మొత్తంలో మద్యం కొనుగోలు చేసే వారిపై పర్యవేక్షణ జరుపుతున్నాం. మద్యం సేవించి అల్లర్లకు పాల్పడడంపై సీసీ కెమెరాల ద్వారా కంట్రోల్ రూం నుంచి 24/7 నిఘా ఉంచుతాం.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

కంటోన్మెంట్: మోండా డివిజన్ పరిధిలోని వెస్ట్ మారేడ్ పల్లి ఎరుకల బస్తీ లో సోమవారం 61.50 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎంపీ ఈటెల, స్థానిక కార్పొరేటర్ కొంతం దీపికలతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మోండా డివిజన్‌లో సిమెంట్ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ తదితర పనులకు రూ.2.7 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఇందులో రూ.61.50 లక్షలతో సిమెంట్ రోడ్లకు భూమి పూజ చేశామన్నారు. కాంగ్రెస్ నాయకులు నాగేష్ యాదవ్, బద్రీనాథ్ యాదవ్, సంతోష్ యాదవ్ పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్, ఎంపీ ఈటెల, కార్పొరేటర్ దీపిక...

ఛాతి నొప్పితో కుప్పకూలి కార్మికుడి మృతి

సనత్‌నగర్: ఛాతి నొప్పితో బాధపడుతున్న ఓ కార్మికుడు కుప్పకూలిపోయి ప్రాణాలు వదిలిన సంఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. పశ్చిమబెంగాల్ రాష్ట్రం మల్దా జిల్లా గంగాప్రసాద్ గ్రామానికి చెందిన నజీముల్ మోమిన్ (34), అతని బావ గోలం నబిలు బతుకుదెరువు కోసం నగరానికి వలసవచ్చారు. వీరు బేగంపేట తాజ్‌వివంతా హోటల్ పక్కన ఉన్న నవయుగ గోదావరిలో కార్మికులుగా పనిచేస్తూ స్థానికంగా నివాసం ఉంటున్నారు. గత నెల 31న మధ్యాహ్నం 12.15 గంటలకు నజీముల్ మోమిన్‌కు ఛాతినొప్పి రావడంతో అతని బావ గోలం నబి స్థానికంగా ఉన్న ఆస్పత్రికి తీసుకువెళ్లాడు. అక్కడ డాక్టర్ పరీక్షించే లోగానే ఒక్కసారిగా కుప్పకూలిపోయి అక్కడ టేబుల్‌పై పడడంతో నుదిటిపై గాయాలయ్యాయి. నజీముల్‌కు అధిక రక్తపోటు ఉందని, వెంటనే పెద్దాసుపత్రికి తీసుకువెళ్లాల్సిందిగా వైద్యుడు సూచించడంతో గాంధీ ఆస్పత్రికి తీసుకువెళ్లాడు. అయితే అక్కడి వైద్యులు పరీక్షించి నజీముల్ అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. బావ గోలం నబి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బేగంపేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడాకారిణి ప్రవల్లికకు ఎమ్మెల్యే అభినందన

సికింద్రాబాద్: జాతీయ క్రీడల దినోత్సవ కార్యక్రమంలో భాగంగా సితాఫల్‌మండీ ప్రాంతానికి చెందిన సాఫ్ట్ బాల్ క్రీడాకారిణి చేపుర్వ ప్రవల్లికను సోమవారం సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావు గౌడ్ ఘనంగా సత్కరించారు. తాజాగా చైనాలో జరిగిన ఆసియా కప్ సాఫ్ట్ బాల్ ఛాంపియన్షిప్ పోటీల్లో ప్రవల్లిక తెలంగాణ రాష్ట్రం నుంచి భారత దేశ జట్టులో ప్రాతినిధ్యం పొంది తన సత్తాను చాటుకుంది. స్పోర్ట్స్ అథారిటీ అఫ్ తెలంగాణ నుంచి నగదు పారితోషికాన్ని కూడా పొందింది.



క్రీడలకు ప్రాధాన్యమిస్తున్నాం : ఎమ్మెల్యే శ్రీగణేశ్

కంటోన్మెంట్: క్రీడలకు రాష్ట ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్స్ లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పరిధిలో 69 వ స్కూల్ గేమ్స్ (కబడ్డీ, ఖోఖో)ను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడల ఆవశ్యకతను వివరించి, జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే క్రమశిక్షణ, కఠోర శ్రమ చాలా అవసరమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా క్రీడలకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తుందని, స్పోర్ట్స్ యూనివర్సిటీని నెలకొల్పి పిల్లలలో క్రీడా నైపుణ్యాలను పెంపొందించడానికి కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రియదర్శిని, డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ ఆఫీసర్ సుధాకర్, డిప్యూటీ డీఈఓ గుండప్ప, ఇన్స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ ప్రసన్న, మాజీ ఆర్గనైజింగ్ సెక్రటరీ రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కబడ్డీ ఆడుతున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

హిందువులు సనాతన ధర్మాన్ని ఆచరించాలి



మాట్లాడుతున్న సూర్యనారాయణమూర్తి

పద్మారావునగర్: హిందుత్వం అంటే ఒక మతం కాదని, ఇది ఒక సనాతన జీవన విధానమని పలువురు పేర్కొన్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ చాచానెహ్రూనగర్ శ్రీ సిద్ధి వినాయక ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద హిందూ ఐక్యతా సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా సాహిత్య పరిషత్ తెలంగాణ ప్రాంత కార్యదర్శి మావుదూరు సూర్యనారాయణ మూర్తి, హిందూ వాహిని భాగ్యనగర్ ఇన్‌ఛార్జీ ఎర్కాలా వాసుగౌడ్, సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ టి. రాజశేఖరరెడ్డి తదితరులు మాట్లాడారు. ప్రతి హిందువు తన ధర్మాన్ని కాపాడుకుంటూ కుటుంబంతో కలిసి తప్పనిసరిగా దేవాలయాలకు వెళ్లి ఆధ్యాత్మిక సేవలో పాల్గొనాలని సూచించారు. యువత హైందవ సంస్కృతి గురించి తెలుసుకొని మన మూలాలను మర్చిపోకుండా భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా ఉండాలని కోరారు. బీజేపీ ప్రధాన కార్యదర్శి కిరణ్, శ్రీనివాస్, రూపేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

'మార్ట్‌గేజ్'పై బీజేపీ యూ టర్న్

కంటోన్మెంట్: కంటోన్మెంట్‌లో నూతనంగా ప్రవేశపెట్టిన మార్ట్‌గేజ్ విధానంపై స్థానికంగా నిరసనలు వ్యక్తం అవుతున్న నేపథ్యంలో రాజకీయ పార్టీలు ఒక్కొక్కటిగా తమ స్వరాన్ని మారుస్తున్నాయి. ఈ ఏడాది మే 23న జరిగిన బోర్డు సమావేశంలో చర్చించి భవన నిర్మాణ అనుమతుల జారీ ప్రక్రియలో మార్ట్‌గేజ్ విధానాన్ని ప్రవేశపెట్టారు. ఇదిలా ఉండగా మార్ట్‌గేజ్ విధానం పట్ల ప్రజల నుంచి నిరసన వ్యక్తం అవుతుండటంతో రాజకీయ పార్టీలు సైతం మద్దతు ప్రకటిస్తున్నాయి. ఇటీవలే బీఆర్‌ఎస్ పార్టీ తరఫున ఆ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె కృషాంక్, మార్ట్‌గేజ్ విధానాన్ని ఎత్తేయాలంటూ డిమాండ్ చేశారు. తాజాగా మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ ప్రజాభిప్రాయం మేరకు మార్ట్‌గేజ్ విధానంలో మార్పులు తేవాలంటూ ప్రకటించారు. ఈ మేరకు సోమవారం బోర్డు సీఈఓ మధుకర్ నాయక్‌ను కలిసి ఈ విషయంపై చర్చించినట్లు తెలిపారు. కంటోన్మెంట్ బోర్డులో ప్రత్యేక ఆహ్వానితుడిగా కొనసాగుతున్న ఆయన మే 23 నాటికి సమావేశానికి గైర్హాజరు అయ్యారు. ఆ తర్వాత జూన్‌లో జరిగిన సమావేశంలో పాల్గొన్న ఆయన, నాటి సమావేశంలో మార్ట్‌గేజ్ విధానంలో అనుమతుల జారీ పట్ల ఎలాంటి అభ్యంతరం చేయలేదు. తాజాగా ప్రజాభిప్రాయానికి అనుగుణంగా బాణీని మార్చడం గమనార్హం.



బోర్డు కార్యాలయంలో సీఈఓతో భేటీ అయిన ఎంపీ ఈటెల రాజేందర్, బోర్డు సభ్యురాలు భానుక నర్మద

వెటరన్ క్రీడాకారులకు ట్రోఫీలు ప్రదానం



లాలాపేట: ద వెటరన్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా లాలాపేటలోని ప్రొ జయశంకర్ ఇండోర్ స్టేడియంలో 4వ తెలంగాణ స్టేట్ టెన్నిస్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. సిటాడెల్ సౌజన్యంతో 11 కేటగిరీల్లో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 215 మంది వెటరన్ క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు సోమవారం సిటాడెల్ గ్రూప్ ఈవిపిఎస్ కృష్ణ, వెటరన్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షులు దయాకర్ కుసుమ, సెక్రటరీ విఠల్ బేతి బహుమతులు అందజేశారు.

గణనాయకాయ.. గణదైవతాయ

వినాయక నవరాత్రి మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. పార్వతీ తనయుడికి భక్తులు నిత్య పూజలు చేస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా భజనలు, అన్నదాన కార్యక్రమాలు, లడ్డూ వేలంపాటలతో ఏకదంతుడి మండపాలు భక్తుల కోలాహలంతో సందడిగా మారాయి. నిమజ్జన ఘట్టం దగ్గర పడుతుండడంతో భారీ ఊరేగింపు నడుమ వినాయకుడిని గంగమ్మ ఒడికి చేర్చేందుకు ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేస్తున్నాయి. డప్పు దరువులు, మంగళ వాయిద్యాలు, దేవతామూర్తుల ప్రతిమలు వెంటరాగా వినాయకుడు అమ్మ చెంతకు చేరేందుకు రెడీ అవుతున్నాడు. సనత్‌నగర్, సికింద్రాబాద్, కంటోన్మెంట్ నియోజకవర్గాలలోని పలు డివిజన్లలోని వినాయక మండపాలను పలువురు రాజకీయ ప్రముఖులు దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు.

–సనత్‌నగర్



సనత్‌నగర్ వినాయకగ్రౌండ్‌లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి..



సనత్‌నగర్ సుభాష్‌నగర్‌లో బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వెల్లాల రామ్మోహన్..



నీలం బాలయ్యదొడ్డి ప్రాంతంలో మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి.



ప్రకాష్‌నగర్‌లో.. విశాల్ సూదం తదితరులు



శేషాపహాడ్‌లో ఏకదంత ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ..



తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయంలో..



బేగంపేట్ మయూరి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..



అన్నదాన కార్యక్రమాలు టీపీసీసీ ఉపాధ్యక్షురాలు కోట నీలిమ



మాణికేశ్వర్‌నగర్‌లో...



మేడిబావిలో..



మోడల్‌కాలనీలో..



బేగంపేటలో..కార్పొరేటర్ టి.మహేశ్వరిశ్రీహరి..



బీకే గూడలో బీఆర్‌ఎస్ నాయకులు...



లాలాపేట వినోభానగర్ కమ్యూనిటీ హాల్లో ..